క్లుప్తంగా

కానిస్టేబుల్ సురేష్‌కు ఎస్పీ ప్రశంసాపత్రం



కరప పీసీ సురేష్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కరప: గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అంకితభావంతో, సక్రమంగా విధులు నిర్వహించిన కరప పోలీసు స్టేషన్‌లో పోలీసు కానిస్టేబుల్(పీసీ) జీకే సురేష్‌కుమార్‌కు ప్రశంసాపత్రం లభించింది. మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అంకితభావంతో పనిచేసిన వారిని ప్రోత్సహించేందుకు జిల్లాలోని ఒక్కొక్క పోలీసుస్టేషన్ నుంచి ఒక పీసీని ఎంపిక చేసి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కాకినాడలోని తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేసినట్టు పీసీ సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం పొందిన పీసీ సురేష్‌కుమార్‌ను కరప ఎస్సై టి.రామకృష్ణ, ఏఎస్సై వి.సూరిబాబు, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

బహిరంగ వేలం ఖరారు



బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

బోట్‌క్లబ్: దేవదాయ శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ముల్లుకుట్ల అచ్యుతరామయ్య గవర్నమెంట్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు చెందిన పాత భవనం బహిరంగ వేలాన్ని సోమవారం నిర్వహించారు. భవనంలో ఉన్న పాత కలప, ఇతర సామాన్లు తీసుకు వెళ్లడానికి నిర్వహించిన ఈ వేలంలో 57 మంది పాటదారులు పాల్గొన్నారు. రూ.ఏడు లక్షలకు మొదలైన పాట రూ.10.80 లక్షలకు హెచ్చుపాటదారునికి ఖరారు చేశారు. బహిరంగ వేలం, సీల్ టెండర్, ఆన్‌లైన్ టెండర్ పద్ధతిలో ఈ వేలం నిర్వహించారు. దేవదాయ శాఖ డీసీ మేడేపల్లి విజయరాజు ఆధ్వర్యంలో ఈ వేలం జరిగింది. జిల్లా దేవదాయ శాఖాధికారి పులి నారాయణ మూర్తి, దేవదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, డీసీ కార్యాలయ సూపరిండెంటెంట్ కె.నాగేశ్వరరావు, ట్రస్ట్ ఈఓ రమణ పాల్గొన్నారు.

నేటి వైద్యులకు హార్వే గొప్ప మార్గదర్శకుడు

బోట్‌క్లబ్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్య శాస్త్రవేత్త విలియం హార్వే నేటి వైద్యులకు గొప్ప మార్గదర్శకులని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఏపీఐఐసీ కాలనీ వద్ద అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వైద్య శాస్త్రవేత్త విలియం హార్వే వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హార్వే గుండె పనిచేసే తీరును, శరీరంలో రక్త ప్రసరణ జరిగే పద్ధతిని 1657లోనే వివరించి నేటి వైద్యులకు మార్గదర్శకులయ్యారన్నారు. మనిషి గుండెకు సంబంధించి పూర్తి వివరాలను మిగతా జంతువుల గుండెలతో పోల్చి చూసి, శాస్త్ర బద్ధంగా అందజేసిన ఘనత విలియం హార్వేకే దక్కుతుందన్నారు. గుండె ముడుచు కోవటం వల్ల రక్తం ధమనుల ద్వారా రక్త నాళాలకు వెళుతుందని తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యార్థుల అవగాహన తరగతులు



విద్యార్థులకు తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు ఝాన్సీ

కాకినాడ సిటీ: పదో తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో మే 21న యూటీఎఫ్ హోంలో ప్రారంభమైన అవగాహన తరగతులు 14వ రోజు సోమవారం కొనసాగాయి. మేథ్స్ సబ్జెక్టును శ్రీనివాస్, ఇంగ్లిష్ సబ్జెక్టును ఝాన్సీ బోధించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా, ఉన్న సమయాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమతో పాటు వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు యూటీఎఫ్‌లో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు క్లాసులు బోధిస్తారని ఝాన్సీ వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు యూటీఎఫ్ హోంకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు టి రవి చక్రవర్తి, సీహెచ్‌వీ రమణ, వరహాలబాబు, కేఎంకే మూర్తి, పి.గిరిధర్‌గోపాల్, తానీషా, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.సంజయ్, ఎ.వాసు తదితరులు పర్యవేక్షించారు.

రేపు నేరెళ్లమ్మతల్లి జాతర

కొత్తపల్లి: మండలంలో కొమరగిరి గ్రామదేవత నేరెళ్లమ్మతల్లి జాతరను బుధవారం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు.

లెక్క తేలేది నేడే..



కౌంటింగ్ కోసం సిద్ధం చేసిన టేబుళ్లు



కౌంటింగ్ జరిగే హాలు ఇదే..

- కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం
- పోస్టల్ బ్యాలెట్‌తో ప్రక్రియ ప్రారంభం
- ఉదయం 8.30కు ఈవీఎంల్లో కౌంటింగ్
- విధుల్లో సుమారు 500 మంది ఉద్యోగులు
- 14 టేబుళ్లపై 17 రౌండ్లలో లెక్కింపు

కాకినాడ: ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక జేఎన్‌టీయూకే ఆవరణలోని సివిల్‌బ్లాక్‌లో ఉదయం 8.00 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ పర్యవేక్షణలో సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు కౌంటింగ్ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 14 టేబుళ్లపై 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ ప్రారంభించనున్నారు. మరో అరగంట తరువాత 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతోంది. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఇప్పటికే విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణ కూడా ఇచ్చారు. కౌంటింగ్ సెంటర్‌లో వ్యవహరించాల్సిన తీరు, నియమ నిబంధనలపై ఏజెంట్లకు కూడా అవగాహన కల్పించారు. మున్నెన్నడూ లేని విధంగా మరిన్ని కఠిన నిబంధనలను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ హాలులో విధులకు వెళ్లే ఏజెంట్లకు కూడా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయనున్నారు. ఇప్పటికే ఈవీఎంల వద్ద మూడంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన అధికారులు.. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

17 రౌండ్లలో లెక్కింపు


కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి 234 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల పోలింగ్ జరిగింది. 2,41,620 మంది ఓటర్లకు లక్షా 74వేల 256 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో మహిళలు 90,624, పురుషులు 83,663, ఇతరులు 64 మంది ఓటు వేశారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ద్వారా 3,221 మంది ఓటు వేయగా, హోం ఓటింగ్ ద్వారా 45 మంది, సర్వీస్ ఓటర్లు 33 మంది ఓటు వేశారు. మొత్తంగా 72.14 శాతం పోలింగ్ నమోదైంది. లెక్కింపు సందర్భంగా సుమారు 450 మంది సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో పాటు, మొత్తం సుమారు 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మధ్యాహ్నానికే స్పష్టత!

సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేల ఫలితాలు మధ్యాహ్నానికే స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఆ మేరకు ఇప్పటికే గెలుపు అంచనాల్లో ఉన్న అభ్యర్థులు తరఫు కార్యకర్తలు నాయకులు ఇప్పటికే లెక్కలు వేసుకుంటున్నారు. ఫలితం తేలిన వెంటనే విజయోత్సవాన్ని జరుపుకోవాలన్న ఆలోచనతో సన్నాహాలు చేస్తున్నారు. విజయంపై సంపూర్ణ విశ్వాసంతో ఉన్న ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి తరుపున ఆ పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ఫలితం కోసం వేచిచూస్తున్నారు.

సంయమనం పాటించండి

కేడర్‌కు ద్వారంపూడి సూచన



ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పార్టీ శ్రేణులు సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఇతర పార్టీల వ్యక్తులు రెచ్చగొట్టేలా వ్యవహరించినప్పటికీ, ఉద్రేకాలకు లోనుకావద్దని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త సహనం, సంయమనంతో వ్యవహరించి పోలీసు శాఖ ఆదేశాలను పాటించాలని సూచించారు. ఓటమి భయంతో ప్రత్యర్థి పార్టీలకు చెందిన కొంతమంది రెచ్చగొట్టేలా వ్యవహరించే అవకాశం ఉందని, ఇటువంటి చర్యలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఫలితాలకు వేళాయె..

- నేటితో కాకినాడ రూరల్ ఉత్కంఠకు తెర
- నేడు జేఎన్‌టీయూకే మెకానికల్ పీజీ బ్లాక్‌లో ఓట్ల లెక్కింపు
- మొత్తం 19 రౌండ్లు.. 14 టేబుళ్ల ఏర్పాటు
- నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్ర పరిశీలకురాలిగా వినోదిని సహరాయ్

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరి కొన్ని గంటల్లో వెల్లడి కానున్నాయి. నరాలు తెగే ఉత్కంఠతో అభ్యర్థులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల మొదలు.. ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయిన రాజకీయ పార్టీల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో 4వ విడతలో ఎన్నికలు జరగ్గా, ఏప్రిల్ 18న నోటిఫికేషన్‌ను విడుదలైంది. ఎన్నికల బరిలో కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి మొత్తం 16 మంది పోటీలో నిలవగా, ప్రధానంగా వైఎస్సార్ సీపీ, జనసేన అభ్యర్థుల మధ్య పోరు సాగింది. మే 13న జరిగిన పోలింగ్‌లో మొత్తం 2,69,330 మందికి గాను, 2,01,833 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.93 శాతం పోలింగ్ నమోదవ్వగా, పురుషులు 1,00,270, మహిళలు 1,01,558, ఇతరులు ఐదుగురు ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 4,418 ఓట్లు నమోదయ్యాయి. పోలింగ్ అనంతరం దాదాపు 22 రోజులకు ఫలితాలు వెల్లడి కానుండడంతో, అభ్యర్థులతో పాటు అందరిలోను టెన్షన్ నెలకొంది. ఓటర్లు తీర్పు ఇచ్చిన ఈవీఎంలను కాకినాడ జేఎన్‌టీయూకే మెకానికల్ పీజీ బ్లాక్ వద్ద స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెల్లడించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు కోసం సిబ్బందికి సోమవారం జేఎన్‌టీయూకేలో తుది శిక్షణ అందించారు.

కౌంటింగ్ ఇలా..

కాకినాడ రూరల్ నియోజకవర్గం ఓట్లను జేఎన్‌టీయూకే మెకానికల్ పీజీ బ్లాక్‌లో లెక్కించనున్నారు. ఇందుకోసం నియోజకవర్గ కేంద్ర పరిశీలకురాలిగా వినోదిని సహరాయ్‌ను ఎన్నికల సంఘం నియమించింది. ఆమె పరిశీలనలో కౌంటింగ్‌ను చేపట్టనున్నారు. మొత్తం 2,01,833 ఓట్ల లెక్కింపునకు గాను 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోస్టల్ బ్యాలెట్ 4,418 ఓట్లను 4 రౌండ్లలోను, వీటీబీఎస్ ఓట్లను ఒక రౌండ్‌లోను, ఈవీఎంలలో ఓట్లను 14 రౌండ్లలో లెక్కించనున్నారు.

ఫలితాలపై వైఎస్సార్ సీపీ ధీమా

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మరోసారి విజయం సాధిస్తారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సానుకూల ఓట్లతో విజయం సాధిస్తామని కన్నబాబు ధీమాతో ఉన్నారు.



కాకినాడ రూరల్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు జేఎన్‌టీయూకే మెకానికల్ పీజీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు

అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు



రమణయ్యపేట వైద్యనగర్‌లోని కురసాల కన్నబాబు ఇంటి మార్గంలో కంచె ఏర్పాటు చేసిన పోలీసులు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనుండడంతో ఎన్నికల బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పవరం స్టేషన్ పరిధిలోని రమణయ్యపేట వైద్యనగర్ మార్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ఇంటికి వెళ్లే మార్గాల వద్ద అడ్డంగా బారికేడ్లు, ఇనుప కంచె ఏర్పాటు చేశారు. అన్ని మార్గాల వద్ద పోలీసులు భద్రత పర్యవేక్షిస్తున్నారు. గొడారిగుంట వద్ద జనసేన అభ్యర్థి పంతం నానాజీ నివాసం పరిసరాల్లోను బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత పెద్దఎత్తున జనాలు తరలి వచ్చే అవకాశం ఉండడంతో, తొక్కిసలాట లేకుండా ఉండేందుకు, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అభ్యర్థుల ఇళ్ల వద్ద బందోబస్తు, రక్షణ చర్యలు చేపట్టినట్టు సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి



స్నాప్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న సభ్యులు

కాకినాడ సిటీ: వాతావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు రీజనల్ కో–ఆర్డినేటర్ సత్యప్రసాద్ కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల ఐదున కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో స్నాప్ (ప్రకృతి, జంతు సంరక్షణ) సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎ, బీ, సీ ప్రాజెక్టుల సెంటర్లలో మొక్కలు నాటినట్టు వివరించారు. ప్రస్తుతం వాతావరణం సమతుల్యత కోల్పోయిందని, దాని వల్ల ప్రజల జీవన ప్రమాణాలు నష్టపోవాల్సి వస్తోందని సత్యప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. స్నాప్ సొసైటీ అధ్యక్షుడు, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, యానిమల్ బర్త్ కంట్రోల్ కో–ఆర్డినేటర్ శ్యామ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ అధికంగా వినియోగించడం వల్ల కూడా పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ సందర్భంగా స్నాప్ సభ్యులు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ పీజీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రాన్ని సోమవారం రాత్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సంబంధించి ఈ మీడియా సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మీడియా ప్రతినిధులకు అవసరమైన హైస్పీడ్ నెట్, టీవీలు, భోజనం, తాగు నీరు, ఇతర అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా మీడియా ప్రతినిధులు కౌంటింగ్ ప్రక్రియ విజువల్స్ తీసుకునేందుకు ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళతారని, ఇందుకు తగిన విధంగా వాహనాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. రౌండ్ల వారీ ఎన్నికల ఫలితాలు మీడియా సమాచార కేంద్రం ద్వారా విడుదల చేస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కార్పొరేషన్ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం శ్రీనివాసు, డీపీఆర్వో డి నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.బాబూరావు, పౌర సరఫరాల డీఎం బాల సరస్వతి, డివిజనల్ పౌర సరఫరాల అధికారి పి.రవి తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు

ఆర్ఓ వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో జె.వెంకటరావు

కాకినాడ: ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. స్థానిక జేఎన్‌టీయూకే ఆవరణలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు మూడో విడత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, కౌంటింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కల్పించామని, తీసుకున్న శిక్షణకు అనుగుణంగా సమర్థంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచీ ముగిసే వరకు ఎన్నికల సిబ్బంది పాత్రపై సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. అదే సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు కూడా నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ సహా ఏ వస్తువునూ లోపలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ పర్యవేక్షణలో అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఏఆర్వో చల్లన్నదొర, ఎన్నికల డీటీలు నాయుడు, పవన్ పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ అబ్జర్వర్‌గా నియమితులైన డాక్టర్ మేజర్ విశాల్ శర్మ, జాయింట్ కలెక్టర్ పిఠాపురం ఆర్ఓ ఎస్ రామ్‌సుందర్ రెడ్డితో కలిసి ఈవీఎంల స్ట్రాంగ్ రూము, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి కేటాయించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాన్ని వివరించారు. ఆర్ఓ రామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి ఉదయం 6 గంటలకే కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అంతా సజావుగా జరిగేందుకు కౌంటింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులకు ఎటువంటి సందేహం లేకుండా, పూర్తి పారదర్శకంగా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు.

వీడనున్న పిఠాపురం సస్పెన్స్

- నేడే సార్వత్రిక ఎన్నికల తుది తీర్పు
- నియోజకవర్గానికి 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- 250 మంది సిబ్బంది నియామకం
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రమైన కాకినాడ జేఎన్‌టీయూ

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తుది తీర్పు వెలువడే క్షణాలు రానే వచ్చేసాయి. మంగళవారం పిఠాపురం నియోజకవర్గ ఓట్లు లెక్కింపు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే కాకినాడ జిల్లా జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్ఓ రామ్‌సుందరరెడ్డి ఆధ్వర్యంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయగా ఆయన సోమవారం కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

జేఎన్‌టీయూకేలో..

జేఎన్‌టీయూకేలో మంగళవారం పిఠాపురం నియోజకవర్గం ఓట్ల కౌంటింగ్‌ను 18 రౌండ్లలో లెక్కించనున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 14 టేబుళ్లు, 18 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. 154 మంది కౌంటింగ్ సిబ్బందితో పాటు ఆర్ఓ, ఏఆర్ఓ, ఎంపీడీఓలు తహసీల్దార్లు, పోలీసులు తదితర సిబ్బంది మొత్తం 250 మంది కౌంటింగ్ ప్రక్రియలో విధులు నిర్వహించనున్నారు.

ఏజెంట్లు సిద్ధం

కౌంటింగ్‌లో పాల్గొనడానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ఏజెంట్లను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీల నేతలు తమ ఏజెంట్లకు శిక్షణ పూర్తి చేశారు. కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఆంక్షలు విధించడంతో ఫలితాలు ఎప్పటికప్పుడు బయటకు రాకుండా కేవలం ఎన్నికల సంఘం ద్వారా మాత్రమే బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏజెంట్లు, మీడియాతో సహా ఎవరి వద్ద కూడా సెల్‌ఫోన్లు సైతం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఎవరికివారే గెలుపుపై ధీమా

గెలుపు మాదే అంటూ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నా చివరికి ఏమి జరుగుతుందో అనే భయం అభ్యర్థుల్లో కనిపిస్తోంది. ఎవరికి వారే గెలుపు తమదే అంటు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత గెలుపు తనదే అంటూ పోలింగ్ పూర్తయిన నాటి నుంచి ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పేదలకు నేరుగా అందడంతో పాటు, అవినీతి రహిత పాలన తనను గెలిపిస్తాయని ఆమె చెబుతున్నారు. ముఖ్యంగా పిఠాపురంలో వైఎస్సార్ సీపీ, జనసేన పార్టీల మధ్యే పోటీ ఉండడంతో ఇరు పార్టీల నేతలు ధీమాగానే ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లతో తాము గెలుస్తున్నామని జనసేన నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు అప్రమత్తం

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందని ఇంటిలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే గత వారం రోజుల నుంచి గ్రామాలను జల్లెడపడుతున్న పోలీసులు సమస్యాత్మక గ్రామాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఏసీబీ ఎస్పీ రామ్మోహన్ ఆధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకూ ఎన్నికల కోడ్ ఉల్లంగించిన వారిపై కేసులు నమోదు చేశారు.

18 సమస్యాత్మక గ్రామాలు

పిఠాపురం నియోజకవర్గంలో 18 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. ఇప్పటికే 506 మందికి 143 నోటీసులు జారీ చేశారు. అలాగే 107 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. బాణసంచా కాల్పుల పైనా నిషేధం విధించారు. జనం గుమికూడటం, సంబరాలు చేసుకోవడం, సభలు, సమావేశాలు నిషేధమన్నారు. పిఠాపురం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసులు భారీగా స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను మోహరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎవరూ బయట తిరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గాని వచ్చే అన్ని దారుల్లోనూ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. బైక్ ర్యాలీలపై నిషేధం విధించిన పోలీసులు ఇప్పటికే వాహన తనిఖీల పేరుతో అనధికారికంగా తిరిగే వందల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా మైనర్లు తిరిగే మోటారు సైకిళ్లపై దృష్టి పెట్టిన పోలీసులు ప్రత్యేక నాకాబందీ నిర్వహించి రికార్డులు లేని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్లకు తరలించారు.